# పెంపకం

"బాబూ! వచ్చావా నాయనా? ఏమ్మా! వచ్చావా? ఎంత ఘోరం జరిగిపోయిందో చూడవే తల్లీ. ఆ భగవంతుడు ఎంత కఠినాత్ముడో చూడండ్రా.

"పాపం! వెర్రితల్లి... పొద్దున్న వరకూ పిల్లలింకా రాలేదా, పిల్లలింకా రాలేదా అంటూను వెళ్ళిపోయిందర్రా మీ అమ్మ, మీరెంత దురదృష్టవంతులర్రా.

"ఇంకా ఎన్ని చిత్రాలు చూపించాలనుకుంటున్నాడో, నన్ను మాత్రం తీసుకుపోకుండా మిగిల్చేసాడర్రా!" ప్రొద్దుట్నుంచి అదే పనిగా ఏడుస్తూ, అప్పుడే ఆగిన నర్సమ్మ మళ్లీ మనవలు రావటంతోనే పిచ్చెత్తినట్టు అయిపోయింది. రెండు చేతులతోనూ తలను బాదుకుంటోంది. ఆమె పక్కనే పిల్లలింకా రాలేదని అటూ, ఇటూ, పచార్లు చేస్తూ అప్పుడే ఏం చేయాలో తోచక మోకాళ్లలో తల దూర్చుకున్న నర్సమ్మ తమ్ముడూ, అల్లుడూ అయిన రామబ్రహ్మం తలెత్తి చూసి "వచ్చేశారా బాబూ! అమ్మా! మీ అమ్మ వెళ్లిపోయిందర్రా!" మనవల్ని రెండు చేతుల్లోకి తీసుకుని బావురుమన్నాడు.

"అన్నయ్యగారూ! మీరే ఇలా అయితే ఎలా? పిల్లలకి మీరే ధైర్యం చెప్పాలి. వాళ్లెప్పుడు ట్రైనెక్కారో? ముందు కాఫీయో, హార్లిక్సో కలిపియ్యి శాంతా! లెండి. ఉదయం నుంచీ వచ్చిమంచినీళ్లు నోట్లో పొయ్యలేదు. జరిగింది జరిగిపోయింది. ఆ భగవంతుణ్ణి దయామయుడంటారు. నిజంగా ఆయన దయామయుడే అయితే ఇంత దారుణానికి ఒడిగట్టి ఉండడు. చలిచీమ కూడా పడికుండా తప్పుకునే తత్వం వదినగారిది. ధర్మరాజులాంటివారు మీరు. మీ పిల్లలకి ఈ స్థితిరావటం నిజంగా ఘోరమే. అలాగని మీరూ పిచ్చివాడిలా అయిపోతే పిల్లలేమయిపోవాలి? లెండి, లేచి కొంచెం గొంతు తడిచేసుకోండి" అని తనకు తోచిన రీతిలో రామబ్రహ్మాన్ని ఓదారుస్తున్నాడు తోడల్లుడు.

"అయిపోయింది తమ్ముడూ! నా జీవితం, పిల్లల జీవితం బూడిదయిపోయింది. వీళ్ల మీద ఎన్ని ఆశలు పెట్టుకుందో, తన బెంగంతా పిల్లల గురించే. వాళ్లనంత దూరం పంపించింది కానీ వాళ్లెలాగున్నారో అని ఏడవని రోజులేదు. 'చిన్నవాడండీ వాడికేం తెలీదు. అది వెర్రితల్లి సుమండీ, అదెలా ఉంటుందో?' రోజూ ఇదే బాధ. మరిక ఏ బాధాలేకుండా తీసుకుపోయాడా దేవుడు' ' అని భార్య శవం మీదపడి రోదించసాగాడు రామబ్రహ్మం.

అప్పుడే రిక్షాదిగి ఇంట్లోకి వచ్చిన పిల్లలు అమ్మమ్మరోదన, తండ్రి వేదనా చూసి అవాక్కయిపోయారు. వాళ్ల ముఖాల్లో ఏ భావనా లేదు. తల్లి కాళ్ల దగ్గర కూలబడిపోయారు. అమ్మమ్మ ఏడుపును చూసిన అయిదు నిమిషాలకి బావురుమంది రామబ్రహ్మం కూతురు నీరజ. మరో పక్క కూలబడిన రామబ్రహ్మం కొడుకు నిఖిల్...

"అమ్మకేమయింది అసలు? ఎలా చనిపోయింది?" అడిగాడు.

"ఏం చెప్పమంటావునాయనా? మొన్న కాఫీ కలుపుతూ తూలిపడిపోయింది. వెంటనే

హాస్పిటల్‌కి తీసుకెళ్లాం. కానీ వైజాగ్ వెళ్లేవరకూ ప్రాణం నిలుస్తుందన్న నమ్మకం కూడా లేదు అన్నారు డాక్టర్లు అయినా టాక్సీబేరమాడి తీసుకెళ్లాం. ఆ దేవుడు కరుణించాడనుకున్నాం. పొద్దున్నవరకూ బాగానే ఉంది. ఇంక ఆపరేషన్ చేస్తారనుకున్నటైంకి పిల్లలింకా రాలేదా? అని అడిగింది. అదే చివరి మాటయిపోతుందనుకోలేదు" వెక్కిళ్ల మధ్య చెప్పటం పూర్తి చేసింది నర్సమ్మ.

రామబ్రహ్మం మరదలు హార్లిక్స్ కలిపి తెచ్చింది. నీరజకి. నిఖిల్‌కి అందించింది. బావగారికో కప్పు, తల్లికో కప్పు అందించింది.

"అసలు టెలిగ్రాం ఎప్పుడందింది? మీరెప్పుడు బయలుదేరారు?" అడిగింది పిల్లల్ని.

"రాత్రి పన్నెండు గంటలకి ప్రిన్సిపాలుగారొచ్చి అర్జంటుగా సూట్‌కేసు సర్దుకోమన్నారు. అక్కనీ బయల్దేరమన్నారు. రేల్వేస్టేషన్‌కి ఆయనే దిగబెట్టారు. కోరమండల్ ఖాళీలేదు. బొకారోలో వచ్చాం. విజయనగరం వరకూ ఎవరో వస్తే మాకు సాయమిచ్చి పంపారు" చెప్పింది నీరజ.

ఇంతలో వంతులుగారొచ్చారు.

"అయ్యా! రామబ్రహ్మంగారూ! సూర్యాస్తమయం అయిపోతోంది. ఆ తల్లి అదృష్టవంతురాలు. పిల్లలొచ్చేశారు. మీరు కొంచెం ధైర్యం తెచ్చుకుని చేయవలసిన పనికానివ్వండి. ఋణానుబంధరూపేణా పశుపత్నిసుతాలయా' అన్నారు అయిపోయింది ఋణం తీరిపోయింది" అనేసి "బాబూ! పిడకలూ, కుండా అన్నీ సిద్ధం చేసేశారా?" అని శవదహనానికి కావాల్సిన సామగ్రిని గురించి అడిగాడు వంతులు రామబ్రహ్మం తోడల్లుణ్ణి. అన్నీ రెడీగా ఉన్నాయని చెప్పాడతను.

కొద్ది క్షణాల్లో తతంగం పూర్తయిపోయింది. శాస్త్రోక్తంగా చెయ్యాల్సిన కర్మకాండ అంతా పూర్తి చేశారు... ఆ తర్వాత శవదహనం కూడా అయిపోయింది.

పన్నెండో రోజూ జరిగిపోయింది. రామబ్రహ్మం హిరణ్య, గోదానాలు నామక: కాకుండా ఘనంగా జరిపించాడు. మనిషి మాత్రం టైఫాయిడ్ పేషెంటులా అయిపోయాడు. భార్యపోయిన పన్నెండు రోజుల్లో ఎంతోమంది వారించగా అతను రెండో, మూడోసార్లు ఎంగిలి పడ్డాడు అంతే. పిల్లలిద్దరూ మాత్రం తల్లిఫోటోని గోడకు అమర్చి పూలదండని అలంకరించారు. సూట్‌కేసులూ, బీరువాలూ వెతికి తల్లి ఫోటోలన్నీ ఆల్బంలో పెట్టారు. కలర్‌లో ఉన్న ఒక ఫోటోని ఫ్రేంలో పెట్టి మధ్యగదిలో టేబిల్ మీద పెట్టారు. పన్నెండోరోజు చుట్టాలు, పక్కాలూ, స్నేహితులూ అందర్నీ భోజనానికి పలిచారు.

అయిపోయింది. వచ్చినవారంతా వెళ్లిపోయారు. రామబ్రహ్మం అక్కయ్యా, తోడల్లుడూ, మరదలూ పిల్లలూ ఉన్నారు.

రామబ్రహ్మం పెద్దమంచం మీద పడుకున్నాడు.

అతనికి భార్య భోజనానికి లెమ్మని పిలుస్తున్నట్లనిపించి ఉలిక్కిపడి లేచాడు. ఒళ్లంతా చమట్లు పోశాయి. ఇంట్లో గోలగా ఉంది. లేచాడు. పిల్లలు టీవీ చూస్తున్నారు. టీవీలో ఇండియా, ఇంగ్లాండు క్రికెట్ సీరిస్ వస్తోంది. నీరజా, నిఖిల్, తోడల్లుడి పిల్లలూ అందరూ క్రికెట్ ఆటలో

లీనమైపోయారు. చప్పట్లు కొడుతున్నారు. కేకలేస్తున్నారు.

రామబ్రహ్మంకి మనసు చివుక్కుమంది. దుఃఖం కమ్ముకొచ్చింది. పిల్లల మీద కోపం వచ్చింది. "ఏమిటాగోల? నీరూ, ఆ టీవీ కట్టేసెయ్" అన్నాడు.

"అయిపోయింది డాడీ! లంచ్‌కెళ్ళిపోతారు మరికాసేపట్లో" అన్నాడు నిఖిల్. మవునంగా గదిలోనికెళ్ళి మేసువాల్చాడు రామబ్రహ్మం.

అందరూ భోజనాలకి లేచారు. భోజనాల దగ్గరకూడా క్రికెట్టు గురించే పిల్లల మాటలు. సాయంకాలం ఫ్రెండ్స్ వస్తే నిఖిల్ వీధిలోకి వెళ్లాడు. నీరజ పక్కవాళ్ల పిల్లలతో కబుర్లలోపడింది. ఏవేవో జోకులేసుకుని నవ్వుకుంటున్నారు.

నీరజా. నిఖిల్ పరీక్షలు దగ్గరపడుతున్నాయని బయలుదేరారు. వాళ్లకు జాగ్రత్తలు చెప్పాడు. అమ్మ గురించే ఆలోంచించి చదువుపాడు చేసుకోకండి" అన్నాడు రామబ్రహ్మం. వాళ్లలాగేనని తలూపారు. మరి కొన్నాళ్లకే పెద్ద పరీక్షలయిపోయాయి. వేసంగి సెలవులకు ఇంటికొచ్చేశారు పిల్లలు వచ్చిన దగ్గర్నించీ పిల్లల్ని కనిపెడుతునే ఉన్నాడు. వాళ్లలో తల్లిపోయిందన్న విచారం పెద్దగా కనిపించనేలేదు. ఎప్పుడు పిల్లల దగ్గర తల్లి ప్రస్తావన తెచ్చినా కాసేపు మవునంగా ఉండిపోయి, మళ్లీ వాళ్ల హడావుడిలో మునిగిపోతున్నారు.

భార్యపోయిన దగ్గర్నుంచీ రామబ్రహ్మానికి ఏ రోజూ నిద్రపట్టలేదు. భోజనం సహించలేదు. పిల్లలు తల్లి గురించి బెంగపెట్టుకుని ఎంతలా చిక్కిపోతారో ననుకున్నాడు. పిల్లలు చిక్కిపోలేదెందుచేత అని అతని బాధకాదు కానీ, వాళ్లు మామూలుగానే ఉండటం ఆ ధోరణి అతనికి అర్థం కాలేదు.

పిల్లలు తల్లిలేకపోవడాన్ని లోటుగా ఎందుకు తీసుకోలేదనలు? అరవై అయిదేళ్ల వయసులో ఉన్న తన తల్లిపోయినపుడు తనూ, అన్నదమ్ములూ, అక్కలూ, చెల్లెళ్లూ ఎంతలా కుమిలిపోయారు? తల్లిలేని లోటుని ఎంత లోటుగా భావించారు?

ఎనమండుగురు సంతానాన్ని తల్లి ఎంతలా చూసుకునేది? అప్పుడు ఆ రోజుల్లో పాతిక ఎకరాల మాగాణి ఉండేది. ఇంటినిండా పాడీపంటా. అప్పుడే పితికిన పాలు నురుగుతో గ్లాసుల్లో వరుసగా పోసి పిల్లలందరికీ ఇచ్చేది. వెన్న తీస్తే ఒక్కొక్కళ్లకి దోసిలినిండా తెచ్చి వెన్న తినిపించేది. రోజూ ప్రయివేటుకెళ్లి ఇంటికి రావటం ఆలస్యం అవుతోందని దార్లో ఏం ప్రమాదం జరుగిపోతుందోననీ భయపడి నాన్నగారికి తెలీకుండా మాస్టార్ని బతిమలాడి ఆయన్నే ఇంటికే రప్పించి ప్రయివేట్ చెప్పించేది. గుమ్మడివొడియాలు ముద్ద తనకిష్టమని అట్లు చేసి పెట్టేది. అన్నకి గోంగూర పచ్చడి, తనకి పచ్చి పెసరపప్పు పచ్చడి ఇష్టమని అదీ తనకి వేరే చేసి అమర్చేది. అప్పుడప్పుడు నాన్నగారు ఇదిగో! ఒకొక్కటి ఇష్టముంటుందని ఎనిమిది పచ్చళ్లు చేసిపెడతావటే! పిల్లల్ని మరీ ముద్దు చేసేస్తున్నావు?" అనేవారు.

" ఆం.. అక్కడికి నేనేదో ముద్దు చేసేస్తున్నట్లు, మీరేమో ముద్దు చెయ్యనట్టూను చోద్దెం.

పట్నం వెళ్లి పెద్దాడికిష్టమని దానిమ్మ పండూ, చిన్నాడికిష్టమని నల్లద్రాక్షవళ్లు, చంటిదానికిష్టమని కోవా ఇలా మీరు మాత్రం మోసుకురావటంలేదూ?'' అనేది.

అవును!

ఆయన మాత్రం ఎంత అభిమానపడేవారు. అంతెందుకు? ఉద్యోగంలో చేరిన కొత్తలో బ్రహ్మచర్యంలో ఉంటూ కసరత్తు చేసి కండలు తిరిగిన శరీరంతో ఇంటికొచ్చిన తనని 'రామం, ఏం ఒటేలు మెతుకులోఏమో! ఎలా చిక్కిపోయావురా! అని కంటతడి పెట్టినపుడు తనకెంత నవ్వొచ్చేదో!

మళీ వెళ్తున్నప్పుడు ఎక్కువసేపుడు నిద్రలేకుండా ఉండొద్దనీ, తడిచేతుల్తో కరెంటు స్విచ్‌లు వేయొద్దనీ ఎన్ని చెప్పేది?

తల్లిపోయి కొన్ని సంవత్సరాలు కాలగర్భంలో కలిసిపోయినా, ప్రతి అబ్దికానికీ అన్నదమ్ములూ, అక్కచెల్లెళ్లూ ఆమెను తల్చుకుని కన్నీరు పెట్టకమానరు.

మరి అలాంటిది వీళ్లెందుకు వాళ్లమ్మని మరిచిపోతున్నారు? పాపం, వీళ్ల గురించి వీళ్లమ్మ ఎంత బెంబేలెత్తి పోయేది? మరెక్కడుంది లోపం? మారుతున్న కాలంతోపాటు అనుబంధాలూ, ఆత్మీయతల్లో కూడా సాంద్రత తగ్గిపోతోందా? లేక పిల్లల్ని పెంచటంలో తేడా ఉందా?

ఆ రోజు తనకి బాగా గుర్తు!

తనతో పనిచేస్తోన్న హెడ్ గుమాస్తా గారబ్బాయి ఇంటికొచ్చాడు. ఆ కుర్రాడు హైదారాబాద్‌లో వాళ్ల పెద్దమ్మగారింట్లో ఉండి చదువుకుంటున్నాడు. నీరూకంటే ఆరు మాసాలు పెద్ద ఉండొచ్చు. ఇంగ్లీషులో ఎంచక్కా మాట్లాడాడు.

తన భార్య ఆ కుర్రాణ్ణే చూస్తూండిపోయింది.

వాళ్లు వెళ్లిన తరువాత మొదలు పెట్టింది. "ఏమండీ! మన నీరూ కంటే ఎంతో పెద్దకాదు. కానీ ఎంచక్కా ఎలా ఇంగ్లీషులో మాట్లాడేస్తున్నాడో చూడండి. మన పిల్లల్నీ ఎక్కడయినా మంచి స్కూల్లో జాయిన్ చేస్తే బాగుణ్ణండీ" అంది.

"నిజమేనోయ్! వాళ్లకంటే అవకాశముంది. మనమెక్కడ జాయిన్ చేస్తాం? అయినా వాళ్ల వయసనగా ఎంత దానికి నిండా నాలుగేళ్లు లేవు అది మనల్ని విడిచి ఏం ఉండగలదు?" అన్నాడు తను.

అప్పటికి సరేనని నిరాశపడి ఊరుకుంది. కానీ ఆమెలో పిల్లలు బాగా చదువుకోవాలనీ, పెద్దపెద్ద ఉద్యోగాలు చేసెయ్యాలనీ తాపత్రయం అధికమైపోయేది. ఉదయం లేచిన దగ్గర్నుంచి చదువుచదువు అని ఒకటేగోల. సాయంకాలం స్కూలునుండి రాగానే టిఫిన్ పెట్టేసేది. మరో అర్ధగంటకి ప్రైవేటు మాస్టరు రెడీ. పాపం! పిల్లల్ని చూస్తే జాలేసేది.

పిల్లలు టీవీని చూస్తే పాడయిపోతారనేది. టీవీ చూడనిచ్చేదికాదు. పిల్లలు బిక్కమొహాలు వేసేవారు. ఒకసారి ఇంట్లో టీవీ కట్టేస్తే పక్కవాళ్ల టీవీకి వెళ్లిపోయారు చెప్పా చెయ్యకుండా అది తెలిసి ఆ రాత్రి "ఏమండీ! వీళ్లు పాడయిపోతున్నారండీ. ఇవాళేం జరిగిందో తెలుసా? వెధవ సినిమా వస్తోందని టీవీ కట్టేస్తే పక్కాళ్ల టీవీ కెళ్లికూర్చున్నారు. నాకేమిటో పిల్లల గురించి బెంగగా ఉందండీ! వీళ్లిక్కడే ఉంటే చెడిపోతారండీ. ఏ వైజాగో, కాకినాడో ట్రాన్స్‌ఫర్ కోసం ట్రైచెయ్యడానికి మీకు కుదరదు. ఎలాగండీ!" అంది.

"ఇదిగో! నీ పిచ్చిగానీ పిల్లలు టీవీ చూస్తే చెడిపోరు. అయినా ఎంతసేపు చదువూ, చదువూ అని వాళ్లలో ఉన్న సహజమైన ఉత్సాహాన్ని పాడు చేస్తున్నావు. వాళ్లనసలు ఆడుకోడానికీ, పాడుకోడానికీ లేకుండా చేస్తున్నావ్" అని కసిరేస్తే" అంతేలెండి... నా బాధ మీకేం తెలుస్తుంది?" అని ఏడుస్తూ పక్కకి తిరిగిపోయింది.

ఆ తరువాత ఓ రోజు ఉదయాన్నే పేపరు చస్తూ "ఏమండోయ్! శుభవార్త" అంటూ పరుగెత్తుకుంటూ వచ్చింది.

"ఏమిటి?"

"చూడండి" పేపరు అందుకున్నాడు రామబ్రహ్మం అందులో ప్రకటన.

"మీ పిల్లల్ని అయ్యేఎస్‌లని చెయ్యాలను కుంటున్నారా? డాక్టర్లని చేయాలనుకుంటున్నారా? ఇంజనీర్లు చేయాలనుకుంటున్నారా? వెంటనే సంప్రదించండి. అయిదో తరగతి నుండి ఇంటర్ వరకూ రెసిడెన్షియల్ కోచింగ్ ఇవ్వబడును. మీ పిల్లల్ని సంవత్సరకాలంలో ఇంగ్లీషులో అనర్గళంగా మాట్లాడేటట్లు చేయడం మా ప్రత్యేకత. సీట్లు పరిమితం. తొందరపడంపడి" ప్రకటన చదివి "ఏమంటావ్?" అన్నాడు తను.

"అదేం ప్రశ్నండి? పిల్లల్ని అక్కడ జాయిన్ చేసేద్దాం, ఇక్కడుంటే గాలిబట్టిపోతున్నారు. నిఖిల్ ఇక్కడే లెక్కలు ఎంతో బాగా చేస్తున్నాడు. అలాటి చోట జాయిన్ చేస్తే స్టేటుఫస్టు కూడా వస్తాడు. నీరూ సంగతి చెప్పనే అక్కర్లేదు. అది ఎక్కడయినా అడ్జస్టు అయిపోగలదు" అంది.

"నీకు బుద్ధుందా? ఈ వయసులో వాళ్లు మనల్ని విడిచి ఉండగలరా? మనం వాళ్లని విడిచి ఉండగలమా?"

"ఆఆ... ఉండలేరు. మీ దగ్గరే ఉంచుకొండి. పరమానందయ్యగారి శిష్యుల్లాగా బొటనవేలు చీక్కుంటూ ఉంటారు" అంది. చివరకు ఎంత చెప్పినా వినలేదు పిల్లల్నిద్దర్నీ విజయవాడలో రెసిడెన్షియల్ స్కూల్లో జాయిన్ చేసి వచ్చాడు. ఆ రోజు తనకు నిజంగా ఏడుపువచ్చింది.

సంవత్సరం తరువాత పిల్లలు ఇంగ్లీషులో అనర్గంళంగా కాకపోయినా బాగానే

మాట్లాడగలిగారు. కానీ వాళ్లలో వెనుకటి ఉత్సాహం, ఆత్మీయతా, ఆనందం లోపించాయి. ఏదో భయం. త్వరగా నిద్ర లేచిపోయేవారు. పుస్తకాలు ముందేసుకుని చదువుకునేవారు, రాసుకునేవారు.

వాళ్లని చూసి తన భార్య ఎంత మురిసిపోయేది?

మరి అంతగా పరితపించిపోయే ఆ మాతృమూర్తిని వీళ్లసలు ఎలామరిచిపోగలుగుతున్నారు? రామబ్రహ్మం ఆలోచనలతో సతమతమయిపోయాడు. చాలాసేపటికిగానీ అతనికి సమాధానం దొరకలేదు.

తన చిన్నతనం తనకి బాగా గుర్తు!

తనింట్లో పనిచేసే రాములమ్మ మూడేళ్లకూతురు తల్లిఒళ్లో ఉండి పాలు తాగుతుంటే "ఛీ! ఇంకా పాలు తాగుతుందేమిటమ్మా" అన్నాడు తల్లితో.

"ఓరిభడవా! నువ్వు నాలుగేళ్లు దాటేంత వరకూ పాలు తాగటం మానలేదు. చివరకు నీచేత పాలు మానిపించడానికి కాకర పసరు పూసుకున్నా నీ పని నీదే కానీ పాలు తాగటం మానలేదు' ' అంది అమ్మ మరి నాలుగేళ్లవరకూ తను తల్లిపాలు తాగటమే మానలేదు. అలాంటిది తన కొడుకుని జ్ఞానం తెలీని రోజుల్లో చదువుకోసం ఎంత దూరంలో ఉంచింది తన భార్య? పిల్లలు చదువులేక చెడిపోతారనే భావించిదికానీ ఆ పసి హృదయాలు ఆత్మీయతకీ, అనురాగాలకీ ఎంత దూరం అయిపోతాయో ఆలోచించలేకపోయింది?

వీళ్లు విద్యావంతులు కావచ్చు. ఉన్నతమైన ఉద్యోగాలు చేయొచ్చు. అత్యున్నత పదవులు చేపట్టవచ్చు. కానీ సాటిమనిషిని మనిషిగా ప్రేమించే తత్వం వీళ్లకలవడు తుందా? తల్లిదండ్రుల సన్నిధిలో ఉండి పొందగలిగే మమకారాన్నీ వాత్సల్యాన్నీ పొందలేకపోయిన వీళ్లు యంత్రతత్వాన్ని గాక, మానవ స్వభావాన్నీ, ప్రేమతత్వాన్నీ అవగతం చేసుకోగలరా? '' ఆ ఆలోచన రాగానే రామబ్రహ్మంకి వెన్నులోంచి వొణుకు పుట్టింది. వీళ్లమీద ఏ ప్రభావాలోపడి, ఉగ్రవాదులుగానో, తీవ్రవాదులుగానో మారిపోతారనడానికి సందేహంలేదు అనిపించింది.

అతను వెంటనే ఒక నిశ్చయానికి వచ్చాడు. పిల్లల్ని తన నీడలోనే ఉంచుకొని చదివించుకోవాలనుకున్నాడు.

(విపుల మాస పత్రిక నుండి)